సాక్షి
ప్రకాశం
శుక్రవారం । 5 । సెప్టెంబర్ । 2025



సారు ఎమ్మెల్యే ఫ్రెండ్ మరి.. కాసులివ్వకుంటే సరేసరి..!
మార్కాపురం ఎమ్మెల్యే కందులకు స్నేహితుడిననే పేరుతో ఓ ఎంపీడీవో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నాడు. - 8లో..



ఎవరికి పట్టేను ఈ వేదన.. ఏ గుండెను తాకేను ఈ రోదన
విధి ఆడిన వింత నాటకంలో ఓ బాలిక అనాథగా మారింది. సొంతవారందరినీ కోల్పోయి సాయం కోసం ఎదురుచూస్తోంది. - 8లో..

గరిష్ఠం/కనిష్ఠం
35 /26

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటీ రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో వర్షాలు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఫెన్సింగ్ క్రీడాకారుల ఎంపిక



క్రీడాకారులను అభినందిస్తున్న అసోసియేషన్ జిల్లా వ్యవస్థాపక అధ్యక్షుడు నాగేశ్వరరావు

ఒంగోలు: జాతీయ స్థాయిలో అండర్–17 విభాగంలో జరగనున్న ఫెన్సింగ్ పోటీలకు జిల్లా నుంచి ఎంపికైన క్రీడాకారుల జాబితాను ప్రకాశం జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి జి.నవీన్ గురువారం ఒక ప్రకటన ద్వారా వెల్లడించారు. పుత్తూరి చక్రిక (చీమకుర్తి–సాబర్ విభాగం బ్రాంజ్), పూసపాటి లిఖితారెడ్డి (చెరువుకొమ్ముపాలెం–ఈపీ విభాగం–బ్రాంజ్) ఎంపికైనట్లు తెలిపారు. వీరు ఈ నెల 8 నుంచి 13వ తేదీ వరకు ఉత్తరాఖండ్ రాష్ట్రం హల్వానీ పట్టణంలోని ఇందిరాగాంధీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించనున్న 20వ క్యాడెట్ అండర్–17 జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఇటీవల పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు సత్తాచాటి జాతీయ స్థాయి పోటీలకు జిల్లా నుంచి ఎంపికయ్యారని వివరించారు. క్రీడాకారులిద్దరితో పాటు వారికి శిక్షణ ఇచ్చిన కోచ్ రాజును ఫెన్సింగ్ జిల్లా వ్యవస్థాపక అధ్యక్షుడు, ఫెన్సింగ్ రాష్ట్ర అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు వి.నాగేశ్వరరావు అభినందించారు.

బి.ఎడ్ నాలుగో సెమిస్టర్ ఫలితాలు విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న వీసీ మూర్తి

ఒంగోలు సిటీ: ఆంధ్రకేసరి యూనివర్సిటీ పరిధిలోని బి.ఎడ్ కళాశాలల్లో 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి నాలుగో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ డీవీఆర్ మూర్తి గురువారం సాయంత్రం విడుదల చేశారు. ఈ పరీక్షలకు మొత్తం 10,936 మంది విద్యార్థులు నమోదు కాగా, వారిలో 95.38 ఉత్తీర్ణత శాతంతో 10,431 మంది విద్యార్థులు పాసైనట్లు యూనివర్సిటీ సీఈ ప్రొఫెసర్ సోమశేఖర్ తెలిపారు. యూనివర్సిటీ స్థాయిలో, ఆయా కళాశాలల స్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను వీసీ మూర్తి, రిజిస్ట్రార్ హరిబాబు, సీఈ సోమశేఖర్, తదితరులు అభినందించారు. ఫలితాల విడుదల కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.నిర్మలామణి, ఓఎస్డీ ప్రొఫెసర్ రాజమోహన్‌రావు, ఏసీఈ డాక్టర్ ఏ భారతీదేవి, పీజీ కో ఆర్డినేటర్ (నాన్ కాన్ఫిడెన్షియల్) డాక్టర్ ఆర్.శ్రీనివాస్, పరీక్షల విభాగం పర్యవేక్షకుడు సూదా శివరామ్, సిబ్బంది పాల్గొన్నారు.

15 నుంచి టైలరింగ్‌లో మహిళలకు ఉచిత శిక్షణ

ఒంగోలు వన్‌టౌన్: మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఒంగోలు రూడ్‌సెట్ సంస్థ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని గ్రామీణ ప్రాంత మహిళలకు ఈ నెల 15 నుంచి 30 రోజుల పాటు ఉచిత శిక్షణ ఉంటుందన్నారు. అభ్యర్థుల వయసు 19 నుంచి 45 సంవత్సరాల్లోపు ఉండాలన్నారు. మహిళలు తమ పూర్తి వివరాలతో కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి కల్పించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 9573363141 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

రేపటి నుంచి ప్రజానాట్య మండలి శిక్షణ శిబిరం

చీమకుర్తి: స్థానిక యూటీఎఫ్ భవన్‌లో ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు ప్రజానాట్యమండలి జిల్లా స్థాయి శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్లు ఆ సంఘ జిల్లా కార్యదర్శి పాత్తూరి సురేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. టీవీ, సినిమాల విష సంస్కృతికి వ్యతిరేకంగా సాంస్కృతికోద్యమ నిర్మాణానికి వినూత్నంగా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాంస్కృతిక మేళాలు, వీధి నాటకాలు, జానపద ఉత్సవాలు, భవిత కోసం బాలోత్సవం, కోలాటం, చెక్కభజన దళాల ఏర్పాటు, నెల నెలా ఓ పూట ఓ పాట నేర్చుకుందాం అనే కార్యక్రమాలతో పాటు కవితా గోష్ఠులు, డప్పుల దరువులు వంటి కళలపై మూడు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. జిల్లాలోని ప్రజాకళాకారులంతా పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సురేష్ కోరారు.

హామీ ఖననం

- ముస్లింల ఖబరస్థాన్ స్థలంలో టీడీపీ నేతల అక్రమ వెంచర్
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ముస్లింలకు రెండెకరాల స్థలం కేటాయింపు
- కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆ స్థలాన్ని రద్దు చేసేందుకు కుట్రలు
- ఆ స్థలంలో పార్క్ కడతానని ఎమ్మెల్యే దామచర్ల ప్రకటన
- ముస్లింలు వ్యతిరేకించడంతో వెనక్కి తగ్గిన వైనం
- ప్రత్యామ్నాయంగా మరోచోట మూడెకరాల స్థలం కేటాయిస్తానని హామీ
- 8 నెలలు గడుస్తున్నా అమలుకు నోచుకోని హామీ
- మండిపడుతున్న ముస్లింలు, ముస్లిం సంఘాలు



ఖబరస్థాన్ కోసం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో పాతిన హద్దురాళ్లు

ముస్లింల ఖబరస్థాన్ కోసం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కేటాయించిన స్థలంపై కూటమి నేతల కన్నుపడింది. రూ.కోట్లు విలువజేసే ఆ స్థలాన్ని కాజేసేందుకు అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కుట్రలకు తెరతీశారు. రెండెకరాల స్థలంలో పార్కు నిర్మిస్తామని, ఖబరస్థాన్‌కు వేరే ప్రాంతంలో స్థలం ఇస్తామని ఒంగోలు ఎమ్మెల్యే ప్రకటించారు. ఎనిమిది నెలలు గడిచినా ఆ హామీ అమలు కాలేదు సరికదా.. ఆ స్థలంలో వెంచర్ వేసి ప్లాట్లుగా విభజించి విక్రయించేందుకు యత్నిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై ముస్లిం సంఘాలు మండిపడుతున్నాయి.



స్థలంలో పాతిన హద్దు రాళ్లు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

నగరంలో 35 వేల మందికిపైగా ముస్లింలు జీవిస్తున్నారు. 120 ఏళ్ల కిందట వారికి కొత్తపట్నం బస్టాండు సమీపంలో ఖబరస్థాన్ కోసం రెండెకరాలు కేటాయించారు. అప్పటి నుంచి ఎవరైనా చనిపోతే అక్కడే ఖననం చేస్తున్నారు. ప్రతి నెలా దాదాపుగా 80 నుంచి 100 మంది వరకు చనిపోతున్నట్లు అంచనా. సహజంగా ఒకరిని సమాధి చేసిన తర్వాత ఆ మృతదేహం పూర్తిగా మట్టిలో కలిసిపోవడానికి కనీసం 6 నెలలు పడుతుంది. ప్రస్తుతం ఉన్న స్థలం సరిపోవడంలేదు. మూడు నెలలకే సమాధిని తవ్వి మరో మనిషిని ఖననం చేయాల్సి వస్తోందని ముస్లింలు ఆవేదన చెందుతున్నారు. దాంతో తమకు మరోచోట ఖబరస్థాన్ కోసం స్థలం కేటాయించాలని దశాబ్దాలుగా పోరాడుతున్నారు. ఏ ప్రభుత్వమూ వారి మొర ఆలకించలేదు. వైఎస్సార్ సీపీ హయాంలో దశరాజుపల్లి రోడ్డులో పోతురాజుకాలువ వంతెన తూర్పు వైపున సర్వే నంబర్ 42లో 1.70 ఎకరాలు, సర్వే నంబర్ 43లో 30 సెంట్లు కలిపి మొత్తంమీద రెండెకరాలను ముస్లిం ఖబరస్థాన్‌కు కేటాయించారు. నగరపాలక సంస్థ కౌన్సిల్‌లో కూడా తీర్మానం చేశారు. ఈ స్థలం కమ్మపాలెం సమీపంలో ఉండటంతో ఇక్కడ ఖబరస్థాన్ ఏర్పాటు చేయడానికి వీలు లేదంటూ కొందరు టీడీపీ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దాంతో ఈ సమస్య వివాదాస్పదంగా మారింది. న్యాయస్థానం గడపతొక్కింది. టీడీపీ నాయకుల అభ్యంతరాలను కోర్టు కొట్టేసింది. అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఒంగోలు ముస్లింలకు ఖబరస్థాన్ సమస్య మళ్లీ మొదటికొచ్చింది. కమ్మపాలెం టీడీపీ నాయకులు అధికారాన్ని అడ్డంపెట్టుకుని ముస్లిం ఖబరస్థాన్ స్థలాన్ని కాజేయాలని ప్లాన్ చేశారు. కమ్మపాలెం అభివృద్ధి పేరుతో ఖబరస్థాన్ స్థలాన్ని రద్దు చేయించేందుకు పావులు కదిపారు.

పార్క్ ఏర్పాటు చేస్తానని ప్రకటన...

ఈ ఏడాది జనవరి 18వ తేదీ నగరంలోని కమ్మపాలెంలో ఎన్టీ రామారావు వర్ధంతి నిర్వహించారు. ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన గెలుపు కోసం కమ్మపాలెం ప్రజలు చేసిన కృషిని మరచిపోలేనని, దశరాజుపల్లి వద్ద ముస్లింలకు కేటాయించిన ఖబరస్థాన్ స్థలాన్ని రద్దు చేసి పార్క్ ఏర్పాటు చేస్తానని ప్రకటించారు. దీంతో నగరంలోని ముస్లింలలో అలజడి మొదలైంది. ఏళ్ల తరబడి పోరాడి సాధించుకున్న ఖబరస్థాన్ స్థలాన్ని రద్దు చేస్తానని చెప్పడాన్ని ముస్లింలు జీర్ణించుకోలేకపోయారు.

ఎమ్మెల్యే నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ నగరంలో భారీ ర్యాలీకి సిద్ధమయ్యారు. నగరంలోని అన్నీ మసీదులలో ఈ విషయాన్ని ప్రకటించారు. ఈ సమాచారం తెలుసుకున్న టీడీపీ నాయకులు సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ముస్లిం మత పెద్దలు, నాయకులను పిలిపించుకుని మాట్లాడి నచ్చజెప్పేందుకు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ప్రయత్నించారు. దశరాజుపల్లి స్థలానికి ప్రత్యామ్నాయంగా మరోచోట ఖబరస్థాన్ కోసం మూడెకరాలు కేటాయిస్తానని హామీ ఇచ్చారు.

8 నెలలైనా ప్రత్యామ్నాయం చూపించలేదు...

ఖబరస్థాన్ కోసం ప్రత్యామ్నాయంగా మూడెకరాలు ఏర్పాటు చేస్తానని ఎమ్మెల్యే దామచర్ల మాటిచ్చి 8 నెలలు గడుస్తోందని నగరానికి చెందిన ముస్లింలు గుర్తు చేస్తున్నారు. ఆ దిశగా ఇప్పటి వరకు ఎలాంటి ప్రయత్నం చేసిన దాఖలాలు లేవంటున్నారు. ఎక్కడా ప్రత్యామ్నాయం చూపెట్టలేదని ఆరోపిస్తున్నారు. అలాగని దశరాజుపల్లిలో గత ప్రభుత్వం కేటాయించిన స్థలంలో ఖననం చేయడానికి అనుకూలంగా తగిన ఏర్పాట్లు కూడా చేయలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో కొత్తపట్నం బస్టాండు సెంటర్లోని పాత ఖబరస్థాన్‌లోనే ఖననం చేస్తున్నామని వాపోతున్నారు. అయినా నగర ప్రజలకు అందుబాటులో ఎక్కడా మూడెకరాల స్థలం లేదని, దశరాజుపల్లిలో గత ప్రభుత్వం ఇచ్చిన చోటే ఖబరస్థాన్ కోసం స్థలం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

కబ్జా చేసిన తమ్ముళ్లు...

కమ్మపాలెం నుంచి దశరాజుపల్లి వెళ్లే మార్గంలో ముస్లింల ఖబరస్థాన్ కోసం కేటాయించిన రెండెకరాల స్థలంపై తెలుగు తమ్ముళ్ల కన్నుపడింది. రూ.కోట్ల విలువజేసే ఈ స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఈ క్రమంలోనే ఇటీవల గుట్టుచప్పుడు కాకుండా కొందరు వ్యక్తులు ఖబరస్థాన్ స్థలాన్ని ఆక్రమించేశారు. అందులో వెంచర్ వేసి విక్రయించుకోవడానికి ఏర్పాట్లు కూడా చేశారు. ఆ స్థలంలో సరిహద్దు రాళ్లు వేయడంతో ముస్లింలు ఆందోళన చెందుతున్నారు. నగరంలో ఎంతో ప్రాముఖ్యత కలిగిన స్థలంలో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు సరిహద్దు రాళ్లు ఎలా వేస్తారని ప్రశ్నిస్తున్నారు. అధికారులకు తెలియకుండానే కబ్జా చేయడం జరుగుతుందా అనే సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. అధికార పార్టీ నాయకుల అండదండలతోనే స్థలాన్ని కబ్జా చేస్తున్నారని ముస్లింలు మండిపడుతున్నారు. ఎమ్మెల్యే దామచర్ల ముస్లింలకు ఇచ్చిన మాట నిలుపుకోవాలని కోరుతున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం ముస్లింలకు అన్యాయం చేయడం సరైన నిర్ణయం కాదని ముస్లింలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కూటమి పాలకులు ముస్లింలను మోసం చేస్తున్నారని విమర్శిస్తున్నారు.

8న ప్రధానమంత్రి జాతీయ అప్రంటీస్‌షిప్ మేళా

ఒంగోలు సిటీ: స్థానిక ప్రభుత్వ ఐటీఐ (బాలురు) కళాశాలలో ఈ నెల 8వ తేదీ ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రధాన మంత్రి అప్రంటీస్‌షిప్ మేళా నిర్వహించనున్నట్లు సహాయ అప్రంటీస్‌షిప్ అడ్వైజర్, ప్రిన్సిపాల్ సీహెచ్‌ఎస్‌వీ ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో జిల్లాలోని ప్రముఖ కంపెనీల యాజమాన్యాలు, శ్రీ సిటీలోని ఎంఎన్‌సీ కంపెనీలు, హైదరాబాదు నుంచి ఫార్మాసూటికల్ కంపెనీల హెచ్‌ఆర్‌లు పాల్గొని ఐటీఐ పాసైన అభ్యర్థులను అప్రంటీస్ శిక్షణకు ఎంపిక చేసుకుంటారని తెలిపారు. ఆయా కంపెనీల పారిశ్రామికవేత్తలు పాల్గొని వారి కంపెనీల ప్రాముఖ్యతను తెలియజేస్తారన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ప్రభుత్వ నిబంధనల మేరకు శిక్షణాభృతి చెల్లిస్తారని తెలిపారు. ఐటీఐ పాసై ఒకేషనల్ కోర్సు ఉత్తీర్ణులైన అభ్యర్థులు పూర్తి వివరాలకు 97031 65456 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

విద్యా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం



ప్రసంగిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర నాయకుడు వినోద్

ఒంగోలు టౌన్: విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని భారత విద్యార్థి సమాఖ్య (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్ వినోద్ విమర్శించారు. గురువారం స్థానిక సెయింట్ జేవియర్స్ పాఠశాల నుంచి రంగా భవన్ వరకు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం రంగా భవన్‌లో నిర్వహించిన సభలో ఆయన ప్రసంగిస్తూ ఎన్నికల సందర్భంగా విద్యార్థులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 28 నుంచి ఈ నెల 4వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా సైకిల్ యాత్ర నిర్వహించినట్లు తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంటు బకాయిలు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. సంక్షేమ హాస్టళ్లలో మెస్ చార్జీలు సరిపోక అగచాట్లు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు లేవని, సిబ్బంది కొరత వేధిస్తోందని, ఇదే పరిస్థితి కొనసాగితే హాస్టళ్లు మూతపడటం ఖాయమని అన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ వీటిపై నోరుతెరిచి మాట్లాడటం లేదని విమర్శించారు. విద్యారంగంపై దృష్టి సారించాలని హితవు పలికారు. ఈ నెల 6వ తేదీ విజయవాడలో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. అనంతరం డీఆర్వోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ, సీఐటీయూ, ఐద్వా, డీవైఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

క్షణికావేశం.. పెను విషాదం



మృతుడి ఇంటి వద్ద గుమిగూడిన బంధువులు



విషాదంలో బోయలపల్లిలోని ఒక వీధి

- భార్యాభర్తల మధ్య గొడవల ఫలితం
- ఇద్దరు కుమార్తెలు, కుమారుడిని చంపేసి ఆత్మహత్య చేసుకున్న తండ్రి
- కన్నీరుమున్నీరవుతున్న కుటుంబ సభ్యులు, బంధువులు
- బోరుమన్న బోయలపల్లె గ్రామం



రోదిస్తున్న మృతుడి భార్య దీపిక, తల్లి వెంకటలక్ష్మి, అత్త రాధ



మోటారు బైక్‌పై వెంకటేశ్వర్లుతో వెళ్తూ కనిపించిన పెద్ద కుమార్తె వర్షిణి

యర్రగొండపాలెం: భార్యాభర్తల మధ్య తలెత్తిన గొడవలతో క్షణికావేశంలో భర్త తీసుకున్న నిర్ణయం తీవ్ర విషాదం నింపింది. తన ఇద్దరు కుమార్తెలు, కుమారుడిని మోటారు సైకిల్‌పై ఎక్కించుకుని ఎవరూ గుర్తించని ప్రాంతానికి తీసుకెళ్లగా, రెండు రోజుల తర్వాత వారు విగతజీవులుగా కనిపించడంతో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు గొల్లుమంటున్నారు. ఈ విషాద ఘటనతో మృతుల స్వగ్రామమైన యర్రగొండపాలెం మండలంలోని బోయలపల్లె గ్రామం బోరున విలపించింది. కనిపించకుండా పోయిన ఇద్దరు కుమార్తెలు మోక్షిత, వర్షిణి, కుమారుడు శివధర్మల కాలిన శవాలను గురువారం పోలీసులు గుర్తించారు. బోయలపల్లె గ్రామానికి చెందిన ఫెర్టిలైజర్ షాపు యజమాని గుత్తా వెంకటేశ్వర్లు, అతని భార్య దీపిక గొడవపడ్డారు. ఆ క్రమంలో గత నెల 31వ తేదీ సాయంత్రం తన ఇద్దరు కుమార్తెలు, కుమారుడిని మోటారు బైక్‌పై ఎక్కించుకుని వెంకటేశ్వర్లు తీసుకెళ్లాడు. ఆ మరుసటి రోజు కుటుంబ సభ్యులు, ఆయన స్నేహితులు గాలించినప్పటికీ వారి ఆచూకీ తెలియలేదు. ఈ నెల 3వ తేదీ తెలంగాణ రాష్ట్రంలోని వెల్దండి మండలం పెద్దాపూర్ గ్రామ సమీపంలో హైదరాబాద్–శ్రీశైలం ప్రధాన రహదారిలోని బూరకుంట వద్ద వెంకటేశ్వర్లు శవాన్ని ఆ ప్రాంత పోలీసులు గుర్తించారు. ఆయన నువాక్రాన్ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు వారు తెలిపారు. మృతుడు తన వెంట తీసుకెళ్లిన ముగ్గురు చిన్నారుల ఆచూకీ తెలియకపోవడంతో వారి గురించి పోలీసులు డ్రోన్ కెమెరాలతో వెతుకులాట ప్రారంభించారు. ఆ ప్రాంతానికి సమీపంలోనే మోక్షిత, వర్షిణి, శివధర్మ మృతదేహాలు కాలిపోయి విడివిడిగా దూరంగా పడి ఉండటంతో అక్కడి పోలీసులు గుర్తించి యర్రగొండపాలెం పోలీసులకు సమాచారం అందజేశారు.

ఒకరి తర్వాత మరొకరిని విడివిడిగా తీసుకెళ్లి హత్య...

వెంకటేశ్వర్లు తన కుమార్తెలు, కుమారుడితో నాగర్ కర్నూల్ జిల్లా డిండి ప్రాజెక్టు, హాజీపూర్ ప్రాంతాల్లో బైక్‌పై తిరిగినట్లు సీసీ కెమెరాల ద్వారా గుర్తించారు. హాజీపూర్ వద్ద ఉన్న పెట్రోల్ బంకు సమీపంలో రెండో కుమార్తె, కుమారుడిని వదిలిపెట్టి పెద్ద కుమార్తెతో బైక్‌పై వెళ్లినట్లు తెలిసింది. దీన్నిబట్టి చూస్తే పెట్రోల్ బంకులో పెట్రోలు పోయించుకుని ముందుగా తన వెంట పెద్ద కుమార్తె మోక్షితను తీసుకెళ్లి హత్య చేసి పెట్రోలు పోసి తగలబెట్టినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఆ తర్వాత కుమారుడు, కుమార్తెను కూడా విడివిడిగా తీసుకెళ్లి హత్య చేసి వారి శవాలపై కూడా పెట్రోలు పోసి తగలబెట్టి ఉంటాడని భావిస్తున్నారు. చిన్నారుల హత్యను జీర్ణించుకోలేక గ్రామస్తుల ఆవేదన...

ఇంట్లో భార్యాభర్తల మధ్య వివాదాలుంటే బంధువులతో చర్చించుకుని పరిష్కరించుకోవాలని, అంతేగానీ.. ముక్కుపచ్చలారని చిన్నారులను దారుణంగా హత్యచేసి కాల్చివేయడమేమిటని బోయలపల్లె గ్రామస్తులు, బంధుమిత్రులు జరిగిన సంఘటనను జీర్ణించుకోలేకపోతున్నారు. తల్లిదండ్రుల మధ్య జరిగిన గొడవలకు పిల్లలు బలికావడం కలచివేస్తోందని అంటున్నారు. బుధవారం వెంకటేశ్వర్లు మృతదేహం లభించడంతో తన పిల్లలను ఎక్కడో వదిలిపెట్టి తాను పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుని ఉంటాడని అందరూ భావించారు. ఆ పిల్లలు తిరిగి గ్రామానికి చేరతారని అనుకున్నారు. కానీ, గురువారం పిల్లల మృతదేహాలు కనిపించడంతో బంధువులు, గ్రామస్తుల ఆశలకు తెరపడింది. చిన్నారులు కూడా మృతిచెందారని తెలుసుకున్న బోయలపల్లె గ్రామం కన్నీటి పర్యంతమైంది. పిల్లల తల్లి, నాయనమ్మ, అమ్మమ్మను ఓదార్చడం ఎవరితరం కాలేదు.



కాలిపోయి కుప్పగా పడి ఉన్న ఒక చిన్నారి శవం

మెరుగైన వైద్యసేవలు అందించాలి

- ఒంగోలు జీజీహెచ్ అధికారులతో కలెక్టర్ తమీమ్ అన్సారియా సమీక్ష



రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సబర్బన్: అవసరమైన వైద్యసిబ్బందిని నియమించుకుని రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంపై దృష్టి సారించాలని ఒంగోలు జీజీహెచ్ అధికారులను కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా ఆదేశించారు. గురువారం ఆమె క్యాంపు కార్యాలయంలో సంబంధిత అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రధానంగా పీడియాట్రిక్స్, గైనకాలజీ విభాగం ద్వారా అందుతున్న సేవలు, అందుబాటులో ఉన్న సిబ్బంది – ఖాళీలు, తదితర అంశాలపై కలెక్టర్ చర్చించారు. ఖాళీగా ఉన్న పోస్టులలోకి డిప్యుటేషన్ ప్రాతిపదికన వైద్యులను తీసుకోవాలని, ఆ దిశగా ఆసక్తి గల వారి నుంచి విల్లింగ్ లెటర్లు తీసుకోవాలని చెప్పారు. వాటి ఆధారంగా జిల్లాలోని పరిస్థితిని తెలియజేసేలా రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని కలెక్టర్ ఆదేశించారు. పోస్టులను భర్తీ చేయాల్సిన అవసరాన్ని కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన భర్తీ అయ్యి ఎలాంటి ఆమోదం లేకుండా సెలవు పెట్టిన వారిని తొలగించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఐసీయూ, ఎంఎన్‌సీయూ విభాగాలలో భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో సూపరింటెండెంట్ డాక్టర్ మాణిక్యాలరావు, ఆయా విభాగాల వైద్యులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నెల్లూరు పీఆర్ ఎస్‌ఈగా వైకే



యరమాల కోటేశ్వరరావు, ఎస్ఈ, పీఆర్

టంగుటూరు: మండలంలోని అనంతవరం గ్రామానికి చెందిన యరమాల కోటేశ్వరరావు (వైకే) నెల్లూరు పంచాయతీరాజ్ విభాగం ఎస్ఈగా బదిలీ అయ్యారు. ఇప్పటి వరకూ ఆయన కందుకూరు ఈఈగా, ఒంగోలు ఇన్‌చార్జి ఈఈగా పనిచేశారు. వైకేకి ఇటీవల ఎస్ఈగా పదోన్నతి లభించి శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఎస్ఈగా నియమితులయ్యారు. చిన్ననాటి నుంచి చదువుపై మక్కువ పెంచుకున్న ఆయన ఇంజినీరింగ్‌పై ఆసక్తితో కష్టపడి చదువుకున్నారు. ఏఈగా, డీఈగా, ఈఈగా సమర్థవంతంగా విధులు నిర్వర్తించి ప్రతీ దశలో ఉన్నతాధికారుల మన్ననలు అందుకుని ఎస్ఈ స్థాయికి ఎదిగారు. విధి నిర్వహణలో తన కింది స్థాయి సిబ్బంది, అధికారులను సమన్వయం చేసుకుంటూ తమ శాఖలో చక్కని ప్రతిభ కనబరిచారు. భవిష్యత్‌లో ఇంజినీర్ ఇన్ చీఫ్ స్థాయికి ఎదగాలని అనంతరం ఎంప్లాయీస్ యూనియన్ మాజీ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ కె.అనిల్‌కుమార్, కె.అంజయ్య, ప్రస్తుత అధ్యక్ష, కార్యదర్శులు ఓఎన్‌జీసీ వెంకటేశ్వర్లు, కె.చిరంజీవి, నాయకులు వై.జయబాబు, వై.కృష్ణారావు, వై.రాజు, వై.ఎలీషా ఆశాభావం వ్యక్తం చేస్తూ అభినందించారు. వైకేని వైఎస్సార్ సీపీ అనంతవరం నాయకులు ఏవీఎస్ రాజు, శారీమందిర్ వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ కసుకుర్తి కోటేశ్వరరావు, సర్పంచ్ ఉప్పలపాటి శ్రీనివాసరాజు, సుబ్బరాజు, నాగరాజు, కె.చినబాలకోటయ్య, కె.వెంకట్రావు తదితరులు అభినందించారు.

9న ఫ్యాకల్టీ నియామకానికి ఇంటర్వ్యూలు

ఒంగోలు సిటీ: స్థానిక డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (అటానమస్)లో 2025–26 సంవత్సరానికి బోటనీ, పొలిటికల్ సైన్స్, కామర్స్, ఫిజికల్ ఎడ్యుకేషన్ సబ్జెక్టులలో గెస్ట్ ఫ్యాకల్టీ నియామకానికి ఈ నెల 9వ తేదీ ఉదయం 10.30 గంటలకు వాక్–ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ డి.కళ్యాణి తెలిపారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులలో పీజీలో కనీసం 55 శాతం మార్కులతో అర్హత కలిగి ఉండాలన్నారు. పురుష అభ్యర్థులు 50 ఏళ్ల పైబడిన వారై ఉండాలన్నారు. అభ్యర్థులు తమ అసలు ధ్రువీకరణ పత్రాలు (ఒరిజినల్ సర్టిఫికెట్లు), ఒక సెట్ జెరాక్స్‌లతో హాజరుకావాలని కోరారు.

క్లుప్తంగా

మద్యానికి డబ్బులివ్వలేదని.. గొడ్డలితో భార్యపై దాడి


చికిత్స పొందుతున్న అంజమ్మ

యర్రగొండపాలెం: మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వలేదని భార్యపై గొడ్డలితో దాడి చేసి గాయపరిచాడు. ఈ సంఘటన మండలంలోని వీరాయపాలెంలో గురువారం జరిగింది. వివరాల్లోకి వెళితే..గ్రామానికి చెందిన రామయ్య మద్యం తాగేందుకు భార్య అంజమ్మను డబ్బులు అడిగాడు. తన వద్ద డబ్బులు లేవని చెప్పడంతో గొడవకు దిగాడు. ఇంట్లో ఉన్న గొడ్డలి తీసుకొని ఆమెపై దాడి చేశారు. ఈ సంఘటన చూసిన అంజమ్మ చెల్లెలు తిరుమల అనంతమ్మపై కూడా దాడి చేసి గాయపరిచినట్లు పోలీసులు తెలిపారు. గాయపడిన వారిద్దరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సీహెచ్ ప్రభాకర్‌రావు తెలిపారు.

10 మంది ఏఓలకు ఎంపీడీఓలుగా పదోన్నతి

ఒంగోలు సిటీ: జిల్లాలో ఏఓలుగా పనిచేస్తున్న 9 మంది, గుంటూరు జిల్లాలో ఏఓగా పనిచేస్తున్న ఒకరు ఎంపీడీఓలుగా పదోన్నతి పొందినట్లు జెడ్పీ సీఈఓ చిరంజీవి ఒక ప్రకటనలో తెలిపారు. కె. ఖయిమ్‌పీరా, కె.సీతారామారావు, డి.అబ్దుల్ ఖాదర్, ఎస్.సత్యమ్, జీవీ కృష్ణారావు, ఎస్.జాన్ సుదరం, వి.ప్రతాప్‌రెడ్డిలను ప్రకాశం జిల్లాకు, కె.ధనలక్ష్మిని బాపట్ల జిల్లాకు, డీవీ రమణారెడ్డి, వై.శంకరరావులను శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాకు కేటాయించినట్లు చెప్పారు.

తహసీల్దార్ సంతకం ఫోర్జరీ..?


విచారిస్తున్న తహసీల్దార్

కొత్తపట్నం: ఇంటి రుణం కోసం తహసీల్దార్ సంతకాన్ని ఫోర్జరీ చేసినట్లు తెలిసింది. వివరాల్లోకి వెళితే..మండలంలోని అల్లూరు గ్రామానికి చెందిన మేడికొండ అంకయ్య ఇంటి రుణం కోసం మధ్యవర్తి రఫీ అనే వ్యక్తిని సంప్రదించాడు. వీరిద్దరూ వెళ్లి ఒంగోలు 60 అడుగుల రోడ్డులో ఓ ప్రైవేట్ ఫైనాన్సీ కంపెనీని వెళ్లారు. అక్కడ కంపెనీ ప్రతినిధులు ఏఏ డాక్యుమెంట్లు కావాలో చెప్పి పంపించారు. ఈ క్రమంలో అంకయ్య సదరు డాక్యుమెంట్ల కోసం బాష అనే వ్యక్తిని సంప్రదించగా..బాష కొత్తపట్నం తహసీల్దార్ సంతకాన్ని ఫోర్జరీ చేసి డాక్యుమెంట్ తయారు చేసి ఇచ్చాడు. ఈ క్రమంలో ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులు డాక్యుమెంట్లు పరిశీలిస్తుండగా..కొత్తపట్నం తహసీల్దార్ సంతకం ఉన్న డాక్యుమెంట్ ఉన్న అనుమానం వచ్చి నేరుగా తహసీల్దార్ శాంతిని కలిశారు. అయితే ఆ డాక్యుమెంట్ చూసిన తహసీల్దార్ శాంతి..అది తన సంతకం కాదని, ఫోర్జరీ చేశారని చెప్పారు. వెంటనే తహసీల్దార్ ఎస్సైకు ఫోన్ చేసి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఈ డాక్యుమెంట్లు గత నెలలో తయారు చేసినట్లు తెలిసింది. దీనిపై గత రెండు రోజులుగా తహసీల్దార్ కార్యాలయంలో విచారణ చేస్తున్నారు.

సారు ఎమ్మెల్యే ఫ్రెండ్ మరి.. కాసులివ్వకుంటే సరేసరి!

- ఎమ్మెల్యే కందుల పేరుతో ఓ ఎంపీడీఓ వసూళ్ల దందా
- సర్పంచ్‌ల నుంచి లక్షల రూపాయలు డిమాండ్
- పనుల బిల్ చేయాలంటే కారు ఫుల్ ట్యాంక్ చేయాల్సిందే..
- ఎంపీడీఓ మైండ్ గేమ్‌తో చిర్రెత్తిపోతున్న సర్పంచ్‌లు, కాంట్రాక్టర్లు



మార్కాపురం:

'నాకు మీ ఎమ్మెల్యే మంచి ఫ్రెండు.. చిన్ననాటి స్నేహితుడు.. నేనెంత చెబితే అంత. నా స్థాయి ఏంటో మీరు ఆలోచించండి' అంటూ అటు పంచాయతీ కార్యదర్శులను.. ఇటు సర్పంచ్‌లను బెదిరిస్తూ, బ్లాక్‌మెయిల్ చేస్తూ దందాలకు పాల్పడుతున్న ఒక మండల పరిషత్ అధికారి తీరు పశ్చిమ ప్రకాశం మొత్తం చర్చనీయాంశమైంది. మార్కాపురం డివిజన్ కేంద్రంలో నివాసముంటున్న సదరు ఎంపీడీఓ వ్యవహారశైలిపై సర్పంచ్‌లు, కార్యదర్శులు ప్రభుత్వ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా, మరికొందరు ఏసీబీ అధికారులకు కూడా ఫిర్యాదు చేసేందుకు సిద్ధమయ్యారు. కూటమి ప్రభుత్వం రాగానే పక్క జిల్లా నుంచి బదిలీపై వచ్చిన ఆయన.. 'నేను అధికార పార్టీ ఎమ్మెల్యేకు అత్యంత సన్నిహితుడిని. నేను చెప్పినట్టు వినకుంటే మీ పనులు కావు' అంటూ అందరినీ బెదరగొట్టేశాడు. ఎవరైనా సర్పంచ్ వచ్చి తాము చేసిన పనిని పరిశీలించి బిల్ చేయాలని కోరితే కనీసం రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు డిమాండ్ చేస్తున్నాడు. దీంతోపాటు ఆయన తిరిగే కారుకు పెట్రోల్ ఫుల్ ట్యాంకు చేయించాల్సిందే. లేదంటే ఆ సర్పంచ్‌తో ఎమ్మెల్యే పేరుచెప్పి బెదిరింపులకు దిగుతున్నాడు. 'మీరు చేసిన వర్కుకు ఎమ్మెల్యే బిల్ చేయవద్దని చెప్పారు. నేను ఏమీ చేయలేను' అంటూ తన వద్ద పనిచేసే ఒక ఉద్యోగితో రాయ్‌బేరం' పెట్టడం సదరు ఎంపీడీఓకు రివాజుగా మారింది. దీంతో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పరిస్థితిని తలచుకుని భయపడుతున్నారు.

టీడీపీ సర్పంచ్‌తో వివాదం

టీడీపీ సానుభూతిపరుడైన సర్పంచ్ తన గ్రామంలో చేపట్టిన పనులను చూసి బిల్ చేయమని కోరగా ఎంపీడీఓ రూ.80 వేలు డిమాండ్ చేశాడు. దీంతో నివ్వెరపోయిన ఆ సర్పంచ్ వెంటనే ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాడు. ఎంపీడీఓ చేసేదేమీ లేక ఆ సర్పంచ్‌తో తన కారుకు పెట్రోల్ ట్యాంకు ఫుల్ చేయించుకుని వెనుదిరిగాడు.

☛ 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా గ్రామ పంచాయతీల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు బిల్ చేయాలంటే ప్రతి సర్పంచ్ దగ్గర నుంచి కనీసం రూ.50 వేలు డిమాండ్ చేస్తున్నాడు. లేదంటే ఎమ్మెల్యే వద్దన్నాడని ఆ సర్పంచ్‌లకు సమాచారం చేరవేస్తూ మైండ్ గేమ్ ఆడుతున్నాడు. దీంతో సర్పంచ్‌లు లబోదిబోమంటున్నారు.


☛ ఉపాధి హామీ పథకం బిల్లుల్లో తనకెవరితో సంబంధం లేకుండా 10 శాతం కమీషన్ ఇవ్వాలంటూ హుకుం జారీ చేశాడు. దీంతో అటు టీడీపీ నాయకులు, ఇటు సిబ్బంది తలలు పట్టుకుంటున్నారు. ఎంపీడీఓ తీరుపై ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిసింది.

☛ ఉపాధి హామీలో భారీ అవకతవకలు జరిగినట్టు వార్తలు రాగానే సంబంధిత సిబ్బందిని పిలిచి 'చర్యలు తీసుకోకుండా ఉండాలంటే నాకు కమీషన్ ఇవ్వాలి' అంటూ బహిరంగంగానే డిమాండ్ చేయడం విమర్శలకు తావిస్తోంది. ఇలా ఎమ్మెల్యే పేరు చెప్పి కమీషన్లు వసూలు చేస్తున్న అధికారి తీరుపై అటు పంచాయతీ కార్యదర్శులు, ఇటు సర్పంచ్‌లు తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు. మార్కాపురం పట్టణంలోని పలు కార్యాలయాల్లో సదరు అధికారి లంచావతారంపై తీవ్ర స్థాయిలో చర్చ నడుస్తోంది. ఇప్పటికే పలువురు సిబ్బంది సదరు అధికారి తీరుపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

ఎవరికి పట్టేను ఈ వేదన.. ఏ గుండెను తాకేను ఈ రోదన..

- తల్లిదండ్రులు లేక సాయం కోసం బాలిక ఎదురుచూపులు


లక్ష్మిలలిత


ఇంట్లోనే చదువుకుంటూ

మార్కాపురం: విధి ఆడిన నాటకంలో ఆ అమ్మాయి అనాథగా మారింది. నా అనేవారు లేక ఒంటరిగా ఉంటూ మనోధైర్యంతో పాఠశాలకు వెళ్తూ పదో తరగతి చదువుతోంది. తలిదండ్రులు, అమ్మమ్మ, నాయనమ్మ, ఇలా ఒకరు తరువాత ఒకరు ఆ అమ్మాయిని వదిలి వెళ్లిపోవడంతో ఒంటరైంది. అయినా పట్టుదలతో పాఠశాలకు వెళ్తూ చదువుకుంటోంది. ప్రస్తుతం పెదనాన్న సంరక్షణలో ఉన్న ఆ అమ్మాయి దీనగాథ. మార్కాపురం మండలంలోని పెద్దనాగులవరం గ్రామానికి చెందిన కాటంరాజు, సావిత్రిల కుమార్తె లక్ష్మిలలిత. సరిగ్గా 6 ఏళ్ల క్రితం కూలీపనులకు వెళ్లే నిమిత్తం తండ్రి కాటంరాజు ఇంటి నుంచి బయలుదేరాడు. అయితే గుండ్లకమ్మపై వరద ఉధృతంగా ప్రవహిస్తున్నా చిన్నప్పటి నుంచి అలవాటైన వాగే కదా అని ధైర్యంగా దిగి నడుస్తుండగా వరద ఉధృతి పెరిగి ప్రవాహానికి కొట్టుకుపోయాడు. తండ్రిని కోల్పోయిన లలిత తల్లి ఉందనే ధైర్యంతో పాఠశాలకు వెళ్లేది. భర్త పోయిన మనోవేదన, అనారోగ్యంతో సావిత్రి కూడా నాలుగేళ్ల క్రితం చనిపోవడంతో లక్ష్మిలలిత అనాథగా మారింది. చిన్న వయసులోనే అనాథగా మారానని బాధపడింది. అదే సమయంలో అమ్మమ్మ నరసమ్మ చేరదీసి ఆలనాపాలనా చూసింది. సవ్యంగా జీవితం సాగిపోతుందనుకున్న సమయంలో మూడేళ్ల క్రితం ఆమె కూడా కాలం చేయడంతో లక్ష్మీ లలిత జీవితం మొదటికొచ్చింది. నాయనమ్మ అల్లూరమ్మ మళ్లీ దగ్గరకు తీసుకుని మనవరాలిని ఆలనా పాలనా చూస్తూ పాఠశాలకు పంపేది. మళ్లీ దేవుడు ఆ కుటుంబంపై పగ పట్టినట్టుగా అనారోగ్యంతో అల్లూరమ్మ కూడా మృతి చెందింది. దీంతో లలిత మళ్లీ ఒంటరైంది. అమ్మానాన్న లేకపోవడంతో ప్రభుత్వం ఇచ్చే తల్లికి వందనం కూడా రాలేదు. ప్రస్తుతం పెదనాన్న ఆంజనేయులు సంరక్షణలో ఉంటోంది. ప్రతి రోజు ఇంటిపనులు చేసుకుని ఇల్లు చక్కదిద్దుకుని గ్రామంలో ఉన్న పాఠశాలకు వెళ్లి పదో తరగతి చదువుతోంది. తన పెదనాన్న కూడా ప్రతిరోజూ కూలీ పనికి వెళ్తున్నాడని, ఇబ్బందులు పడుతూనే చదివిస్తున్నాడని చెప్పింది. దాతలు ఎవరైనా స్పందించి తనకు ఆర్థిక సాయం అందించాలని లక్ష్మిలలిత చేతులు జోడించి ప్రార్థించింది. తనకు సాయం చేయాలనుకునే వారు పెదనాన్న ఆంజనేయులును సంప్రదించాలని విజ్ఞప్తి చేసింది.

ప్రభుత్వ భూముల్లో అక్రమ మైనింగ్‌పై హైకోర్టు కొరడా

- సాగర్ నీటి పరీవాహక కాలువలు, భూములపై గ్రానైట్ క్వారీల అక్రమ మైనింగ్
- హంస గ్రానైట్, జయమినరల్స్, ఎన్‌వీ ఎక్స్‌పోర్ట్స్‌కి చెందిన క్వారీ యాజమాన్యంపై హైకోర్టు సీరియస్
- స్వచ్ఛంద సంస్థ తరఫున హైకోర్టులో ప్రజాప్రయోజనాల వ్యాజ్యం
- 6 వారాల లోగా నివేదిక ఇవ్వాలని కలెక్టర్, మైన్స్ డీడీ, రెవెన్యూ అధికారులకు హైకోర్టు నోటీసులు


సాగర్‌కాలువను ఆక్రమించుకొని రోడ్డు వేసుకున్న జయమినరల్స్ గ్రానైట్ ప్రాంతం

చీమకుర్తి: ప్రభుత్వ భూములను అడ్డగోలుగా ఆక్రమించుకొని దొడ్డిదారిలో అక్రమ మైనింగ్ చేస్తున్న గ్రానైట్ క్వారీలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని హైకోర్టు కొరడా ఝుళిపించింది. సొసైటీ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ ప్రాపర్టీ అండ్ ఎన్విరాన్‌మెంట్ రైట్స్ అనే స్వచ్ఛద సంస్థ జిల్లా అధ్యక్షుడు పి.హేబేలు హైకోర్టులో దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై హైకోర్టు ఘాటుగా స్పందించింది. బుధవారం ఈ ప్రజాప్రయోజన వ్యాజ్యంపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాగూర్, జస్టిస్ చల్లా గుణరంజన్ ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున న్యాయవాది జడ శ్రావణ్‌కుమార్ తమ వాదనలు వినిపించారు. చీమకుర్తి మండలంలోని ఆర్‌ఎల్ పురం పంచాయితీలోని సర్వే నంబర్ 66/1లో జయమినరల్స్, సర్వే నంబర్లు 67/1ఏ, 67/2ఏ, 69/2, 70/2, 70/3 లలో హంస గ్రానైట్ , బూదవాడ పంచాయతీలోని సర్వేనెంబర్‌లు 107, 108 లో ఎన్‌వీ ఎక్స్‌పోర్ట్‌లో అన్ని గ్రానైట్ గ్రానైట్ క్వారీలన్నీ కలిపి మొత్తం 18.17 ఎకరాల ప్రభుత్వ భూమిలో అక్రమ మైనింగ్ చేస్తున్నట్లు పిటిషనర్ న్యాయవాది ధర్మాసనం దృష్టికి తీసుకువచ్చారు. దాని వల్ల కలిగే అనర్థాలపై అధికారులకు ఫిర్యాదు చేసినా ఎవరూ స్పందించకపోవడంతో చేసేది లేక ఫిర్యాదుదారుడు హైకోర్టును ఆశ్రయించాడు. దీంతో స్పందించిన హైకోర్టు ధర్మాసనం ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలు జరుగుతుంటే అధికారులు ఎందుకు స్పందించలేదని, ఈ ఆక్రమణలపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో 6 వారాల లోగా నివేదిక తమ ముందు ఉంచాలని కలెక్టర్, జిల్లా రెవెన్యూ, మైనింగ్ అధికారులను ఆదేశిస్తూ గ్రానైట్ కంపెనీలకు నోటీసులు జారీ చేస్తూ విచారణను 6 వారాలకు వాయిదా వేశారు.

ఇరిగేషన్ భూములతో మాకేం సంబంధం

గ్రానైట్ క్వారీల యాజమాన్యం ఆక్రమించుకున్న భూములు ఇరిగేషన్ శాఖకు చెందినవి. ఆ భూముల గురించి ఆ శాఖ ఎస్‌ఈ, ఈఈ, డీఈ, ఏఈలు చూసుకోవాలి. మాపై బురద చల్లే పనులు చేస్తున్నారే తప్ప ఇరిగేషన్ శాఖ వారిని అడగాలి. కాలువలు, వాగులు, వంకల భూములు ఆక్రమించుకొని క్వారీయింగ్ చేస్తుంటే మాకేం సంబంధం.

– రాజశేఖర్, మైన్స్ డీడీ, ఒంగోలు

బైక్ మెకానిక్ గంజాయి వ్యాపారం

- గంజాయి తరలిస్తూ ఒంగోలు పోలీసులకు చిక్కిన నిందితుడు
- 10 కేజీల గంజాయి స్వాధీనం


ఒంగోలు ఎక్సైజ్ పోలీసు స్టేషన్లో వివరాలు వెల్లడిస్తున్న ఏఈఎస్ జనార్దన్

ఒంగోలు టౌన్: విశాఖపట్నం నుంచి తమిళనాడుకు గంజాయి తరలిస్తున్న ఇద్దరు నిందితులను ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అరెస్టు చేశారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఈఎస్ జనార్దన్ వివరాలను వెల్లడించారు. తమిళనాడు రాష్ట్రంలోని మధురైకు చెందిన పాండిరాజన్ మోటార్ బైకు మెకానిక్‌గా పనిచేస్తుంటాడు. అతడి స్నేహితుడైన భాస్కరన్ సెంట్రింగ్ పనులకు వెళుతుంటాడు. తక్కువ కాలంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలన్న ఆశతో గంజాయి విక్రయాలకు పాల్పడుతున్నారు. విశాఖపట్నంలోని పూజారి బుచ్చిబాబు దగ్గర కిలో రూ.3,500 చొప్పున 10 కేజీల గంజాయిని కొనుగోలు చేశారు. మధురైకి చెందిన తంబియస్‌కు కిలో రూ.12,500లకు విక్రయించడానికి ఒప్పందం చేసుకున్నారు. రైలు మార్గం ద్వారా విశాఖపట్నం నుంచి తమిళనాడుకు వెళుతున్న క్రమంలో ఒంగోలు రైల్వేస్టేషన్ ఎదురుగా రైల్వే కోచ్ రెస్టారెంట్ వెనక ఆటోస్టాండ్ వద్ద ఉండగా అనుమానం వచ్చిన ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్సుమెంట్ సీఐలు ఆర్.నరహరి, ఎస్.రామారావు, ఎస్సైలు రాజేంద్ర, మౌలాలీలు బ్యాగులు తనిఖీ చేశారు. అందులోని 10 కేజీల గంజాయితో పాటుగా రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను ఒంగోలు ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు. దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ వెంకటరావు, కానిస్టేబుళ్లు జయసూర్య, శ్రీనివాస్, నాగరాజు, బాల సుబ్బయ్య, వెంకటరావు, రామిరెడ్డి, చలపతి, హర్ష, కొండలరావు పాల్గొన్నారు. నిందితులను అరెస్టు చేయడంలో చాకచక్యంగా వ్యవహరించిన సిబ్బందిని డిప్యూటీ కమిషనర్ కె.హేమంత నాగరాజు, అసిస్టెంట్ కమిషనర్ కె.విజయ అభినందించారు.

పథకం ప్రకారమే హత్య


బ్రహ్మయ్య కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న కేపీ నాగార్జునరెడ్డి


బోరున విలపిస్తున్న బ్రహ్మయ్య తల్లి, కుటుంబ సభ్యులు

- హత్య కేసును పారదర్శకంగా దర్యాప్తు చేయాలి
- వైఎస్సార్ సీపీ గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి కేపీ నాగార్జునరెడ్డి


హోటల్‌లో తిరుగుతున్న పోలీస్ జాగిలం

బేస్తవారిపేట: కంభం మండలం దరగకు చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త గాలి బ్రహ్మయ్య (25)ను కిరాతకంగా చంపడం దారుణమని ఆ పార్టీ గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. ఘటన గురించి తెలుసుకుని సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎన్నో రోజుల నుంచి కక్ష పెట్టుకుని ఒక పథకం ప్రకారమే హత్య చేసినట్లు తెలుస్తోందన్నారు. పోలీస్ అధికారులు పారదర్శకంగా విచారణ చేసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. కుమారుడిని కోల్పోయి ఒంటరిగా నిలిచిన మృతుడి తల్లికి ప్రభుత్వం సహాయం అందించాలని కోరారు.

కుటుంబ సభ్యుల కన్నీరుమున్నీరు

ఏడేళ్ల క్రితం బ్రహ్మయ్య తండ్రి వీరభద్రుడు మరణించగా, తల్లి కష్టపడి పెంచి పెద్దచేసింది. ముగ్గురు ఆడపిల్లలకు వివాహమైంది. ఒక్కగానొక్క కుమారుడు బ్రహ్మయ్య కుటుంబానికి ఆసరాగా నిలిచాడు. కొంత కాలం క్రితం ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగంలో చేరినా మధ్యలో మానేసి వచ్చేశాడు. ఇటీవల హైదరాబాద్‌లో ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం వచ్చింది. గణేష్ నవరాత్రుల అనంతరం ఉద్యోగంలో చేరేందుకు వెళ్లాల్సి ఉంది. ఇంతలోనే కుమారుడు మరణించడంతో తల్లి, కుటుంబసభ్యులు గుండెలవిసేలా రోదిస్తున్నారు.

హోటల్ చుట్టూ తిరిగిన పోలీస్ జాగిలం...

అమరావతి నుంచి వచ్చిన ఫోరెన్సిక్ టీమ్, ఒంగోలు క్లూస్‌టీంలు సంఘటన స్థలానికి చేరుకుని వేలిముద్రలు, ఆధారాలు సేకరించారు. పోలీస్ జాగిలం జాకీ హత్య జరిగిన ప్రదేశం నుంచి కిలోమీటర్ దూరంలోని న్యూస్వప్న హోటల్ వద్దకు వెళ్లింది. అక్కడి నుంచి హోటల్ వెనుకవైపున వదిలివెళ్లిన మృతుడి బైక్ చుట్టూ తిరిగి పక్క వీధి నుంచి మళ్లీ హోటల్‌కు వచ్చింది. అనంతరం ఒంగోలు వైపునకు హైవేరోడ్డు వెంట మద్యం దుకాణాల వైపునకు వెళ్లింది.

300 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

- రేషన్ షాపులో అంతా బాగుందంటున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ
- లారీ ఓనర్, డ్రైవర్‌పై 6ఏ కేసు నమోదు
- లారీ, బియ్యం సీజ్


అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం లారీని పట్టుకున్న ప్రజా సంఘాల నాయకులు

కనిగిరిరూరల్: పట్టణంలోని ఓ రేషన్ దుకాణం నుంచి టెంపో లారీలో అక్రమంగా తరలిస్తుండగా 300 బస్తాల రేషన్ బియ్యాన్ని ప్రజాసంఘాల నాయకులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే..పట్టణంలోని 15వ రేషన్ షాపు నుంచి బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో సీపీఎం, సీఐటీయూ, ప్రజా సంఘాల నాయకులు అడ్డుకోవడంతో అక్రమార్కులు లారీని వదిలేసి పరారయ్యారు. రేషన్ బియ్యం లారీలో ఉన్న 300 బస్తాల్లో సుమారు 136 బస్తాలు ప్రభుత్వ పాఠశాలలకు సరఫరా చేసినవిగా గుర్తించారు. దీంతో ప్రజా సంఘాల నాయకులు రెవెన్యూ, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు ఫోన్ చేసిన సమాచారం ఇచ్చారు. దీంతో ఎన్‌ఫోర్సుమెంట్ డీటీ ఆర్ భూపతి, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ మనోహర్‌రెడ్డి, రెవెన్యూ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని బియ్యాన్ని పరిశీలించి సీజ్ చేశారు.

రేషన్ అక్రమార్కులను తప్పిస్తున్నారా..?

ఓ వైపు ప్రజా సంఘాల నాయకులు షాప్ నంబర్ 15 నుంచి లోడింగ్ చేస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నామని ఫొటోలు, వీడియోలు విడుదల చేశారు. కానీ ఎన్‌ఫోర్స్‌మెంట్, రెవెన్యూ అధికారులు మాత్రం పట్టుకున్నది రేషన్ బియ్యమేనని. అయితే ఆ బియ్యం బేస్తవారిపేటకు చెందిన మిల్లు, బియ్యం వ్యాపారి రమేష్‌వి అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. ఓనర్ రమేష్‌పై లారీ డ్రైవర్‌పై 6ఏ కేసులు నమోదు చేసి లారీని, బియ్యాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. ఈమేరకు గోడౌన్ అధికారులకు అప్పగించి జేసీ కోర్టులో హాజరుపరుస్తున్నట్లు చెప్పారు. రేషన్ షాపులో ఆన్‌లైన్ ప్రకారం అన్ని పరిశీలించామని ఎటువంటి తేడాలు లేవని చెప్పారు. మరీ 15వ నంబర్ నుంచి రేషన్ బియ్యాన్ని ఎత్తుతున్నట్లు వీడియోపై ప్రశ్నించగా.. దీనిపై విచారిస్తున్నామని ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ ఆర్ భూపతి తెలిపారు. 15 నంబర్ డీలర్ అధికార పార్టీకి చెందిన నాయకుడు కావడంతో తప్పించేందుకు ప్రయత్నిస్తున్నారని, అలా చేస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి న్యాయ పోరాటం చేస్తామని సీఐటీయూ నాయకుడు కేశవరావు హెచ్చరించారు.

వైఎస్సార్ సీపీ నేతలపై అక్రమ కేసు

- వైఎస్సార్ వర్థంతి సందర్భంగా వైఎస్సార్, జగన్ చిత్రపటాలు ప్రదర్శించారని అక్రమ కేసు
- మంత్రి స్వామి ప్రోద్బలంతో ఫిర్యాదు చేసిన స్థానిక టీడీపీ నాయకుడు
- ఏడుగురు వైఎస్సార్ సీపీ నేతలపై అక్రమ కేసు

పొన్నలూరు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసుల పరంపర కొనసాగుతోంది. పొన్నలూరు మండల పైరెడ్డిపాలెంలో మంగళవారం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 16వ వర్ధంతి సందర్భంగా స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్, నాయకులు హాజరయ్యారు. వీరంతా గ్రామానికి చేరుకున్న తరువాత వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించి అన్నదానం కార్యక్రమం దగ్గరకు వెళ్లారు. అయితే వైఎస్సార్ సీపీ నేతలు వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించి గ్రామంలోకి వెళ్లే సమయంలో స్థానిక చిన్నారులు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటాలను ప్రదర్శించారు. అయితే ఈ చిత్రపటాలను ప్రదర్శించారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుద్దుగుంట మల్లికార్జునరెడ్డి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు కర్నా మస్తాన్‌రెడ్డి, కదిరి సుధాకర్‌రెడ్డి, కదిరి రవిరెడ్డి, కదిరి కృష్ణారెడ్డి, సిరిగిరి రామకృష్ణారెడ్డి, ఎస్సీ కాలనీకి చెందిన దారా చినరామయ్యలపై బుధవారం రాత్రి అక్రమంగా కేసు నమోదు చేశారు.

మంత్రి స్వామి ఒత్తిడితో ఫిర్యాదు..

వాస్తవంగా మంగళవారం పైరెడ్డిపాలెం గ్రామంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి కార్యక్రమాలను ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించారు. ఇది ఓర్చుకోలేని మంత్రి స్వామి, స్థానిక టీడీపీ నాయకులు..పైరెడ్డిపాలెంలో చిన్నారులు ప్రదర్శించిన రెండు చిన్న చిత్రపటాలను అడ్డుపెట్టుకోని వైఎస్సార్‌సీపీ నేతలపై అక్రమ కేసు పెట్టించాలని రెండు రోజులుగా పోలీసులపై తీవ్ర ఒత్తిడి తెచ్చారు. దీనికి పైరెడ్డిపాలెం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడిపై తీవ్రమైన ఒత్తిడి తీసుకొచ్చి బుధవారం రాత్రి 11 గంటల సమయంలో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు ఇప్పించారు. ఎలాంటి అశాంతి కార్యక్రమాలు, గొడవలు లేకపోయినా..గ్రామంలో శాంతి భద్రతలకు భంగం కలిగించారని అవాస్తవాలు సృష్టించి మంత్రి స్వామి ఆదేశాలతో అక్రమంగా కేసు నమోదు చేయించారు.

రూ.2.19 లక్షలు పలికిన లడ్డూ ప్రసాదం


లడ్డును దక్కించుకున్న గుండ్లా యల్లయ్యగౌడ్

పెద్దారవీడు: మండలంలో ప్రగళ్లపాడులో వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా స్వామి వారి చేతిలోని 9 కేజీల లడ్డుకు వేలంపాట నిర్వహించారు. గ్రామానికి చెందిన గూండ్లా యల్లయ్యగౌడ్ రూ.2.19 లక్షలకు కైవసం చేసుకున్నారు.